క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్ పర్యటన



వెల్దుర్తి: మాచర్ల పట్టణంలో గ్రామోదయం కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్నట్టు మాచర్ల మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు తెలిపారు. శుక్రవారం పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం పలు వార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బత్తిన వేణు, డీలర్ ఆకుల శ్రీను, హెల్త్ సెక్రెటరీ చంద్రకళ, సెక్రెటరీ సరోజబాయి, వెల్ఫేర్ సెక్రెటరీ చంద్రలాల్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ



వెల్దుర్తి: ఎస్‌ఆర్‌ఐ వాసవీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు వైద్యులు సముద్రాల రాములు, సుశీల, కాళంగి శ్రీనివాసరావు చెప్పారు. శ్రీరామకృష్ణ విద్యాలయంలో గ్రంథాలయానికి శుక్రవారం 500 పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కమ్మిరెడ్డి మాట్లాడుతూ పుస్తకమిత్ర అనే కార్యక్రమం ద్వారా ఎస్‌ఆర్‌ఐ వీఏ అనేక పాఠశాలలకు పుస్తకాలు అందించిందని పేర్కొన్నారు. పాఠశాలకు ర్యాక్స్ కూడా విరాళంగా ఇచ్చిందని చెప్పారు. 10వ తరగతి విద్యార్థులకు అట్టలు, పరీక్ష సామగ్రిని అందజేసినట్లు వివరించారు.

నేటి నుంచి కాళికా మాత కుంభాభిషేకం

మాచవరం: పిన్నెల్లి గ్రామంలోని కాళికా మాత దేవస్థానంలో శనివారం నుంచి ఈనెల 27 వరకు పుష్కర కుంభాభిషేక మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 25న కోటి లింగాల మహాశివక్షేత్ర వ్యవస్థాపకులు శివస్వామి చేతుల మీదుగా అఖండ దీప స్థాపన, గ్రామ ప్రదక్షిణ, పూజా కార్యక్రమాలు, 26న మహా చండీయాగం, అమ్మవారి బోనాల శోభాయాత్ర, 27న మహా కుంభాభిషేక మహోత్సవం జరుగుతాయని వివరించారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



పిడుగురాళ్ల : స్థానిక ఇందిరమ్మ కాలనీలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో శివరామకృష్ణ డెంటల్ కేర్ హాస్పిటల్, సత్తెనపల్లి హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. వైద్యులు శివరామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని ఎంచుకుని దానికోసం శ్రమించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు, సభ్యులు లక్ష్మి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

దుర్గి: దుర్గి, పరిసర గ్రామాలలో శుక్రవారం సాయంత్రం గాలివాన భీభత్సం సృష్టించింది. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. సుమారు అరగంటపాటు గాలివాన హడలెత్తించింది. చిరువ్యాపారులు, తోపుడు బండ్ల వారు ఇబ్బందులు పడ్డారు. కల్లాల్లో ఉన్న మిర్చి, కంది, మొక్కజొన్న పంటలు తడవటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టాలు కప్పేలోపే గాలివాన కురవడంతో పంటలు పాడయ్యాయని వారు కన్నీటిపర్యంతమయ్యారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

మాచవరం: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉన్నతంగా ఎదుగుతారని హెచ్‌ఎం కొల్లి పద్మజ చెప్పారు. మోర్జంపాడు జెడ్పీ హైస్కూల్‌లో పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా ప్రభాకర్‌రావు



యరమోతు ప్రభాకర్‌రావు

దాచేపల్లి : బీజేపీ మండల శాఖ అధ్యక్షుడిగా దాచేపల్లికి చెందిన యరమోతు ప్రభాకర్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు చేతుల మీదుగా నియమకం పత్రం శుక్రవారం ప్రభాకర్‌రావుకు అందజేశారు.

• కమనీయ అలంకారం

పిడుగురాళ్ల పట్టణంలోని నాగులు గుడి దేవస్థానంలో దేవీ వసంత నవరాత్రులలో భాగంగా సరస్వతి అమ్మవారు ధనలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రూ.4 లక్షల విలువైన కరెన్సీ నోట్లతో అమ్మవారిని సుమనోహరంగా అలంకరించారు. ఆలయ పూజారి వెంకటేశ్వరశర్మ పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

– పిడుగురాళ్ల



ధనలక్ష్మీగా భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

• ఆధ్యాత్మికతకు నెలవు..

రంజాన్ నెల శుక్రవారం ప్రారంభమైంది. ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలు మొదలు పెట్టారు. పిడుగురాళ్ల పెద్ద మసీదులో అంజుమన్ కమిటీ అధ్యక్షులు ఎండీ ఉస్మాన్ మేస్త్రీ ఆధ్వర్యంలో నమాజ్ జరిగింది. ఈ సందర్భంగా అంజుమన్ కమిటీ అధ్యక్షులు ఉస్మాన్ మేస్త్రీ మాట్లాడుతూ ముస్లిం సోదరులు రంజాన్ నెలలో పవిత్రత చాటుతారని, దానధర్మాలతో పేదలకు సహాయ, సహకారాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా మైనార్టీ అధ్యక్షులు ఎండీ గఫార్, అంజుమన్ కమిటీ సెక్రటరీ షేక్ మస్తాన్, పఠాన్ మాభు, గౌస్, బాబు సాహెబ్, ఆప్టికల్ భాషా, తురకపాలెం సర్పంచ్ అల్లాబక్షు,జిలానీ, ముస్లిం మత పెద్దలు, సోదరులు తదితరులు పాల్గొన్నారు.

– పిడుగురాళ్ల



నమాజ్ అనంతరం బయటకు వస్తున్న అంజుమన్ కమిటీ అధ్యక్షులు ఉస్మాన్ మేస్త్రీ, కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులు

కష్టాలకు మంగళం పాడింది

- పాడిపశువుల రక్షణకు సర్కారు చర్యలు
- గ్రామాల్లో సంచార పశు వైద్య సేవలు
- ఆనందంలో పశు పోషకులు

మాచర్ల రూరల్: పాడి రైతుల కష్టాలకు ప్రభుత్వం చరమగీతం పాడింది. పశువుల సంరక్షణ కోసం డాక్టర్ వైఎస్సార్ సంచార ఆరోగ్య సేవ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ వాహనాల ద్వారా పశువైద్య సిబ్బంది గ్రామాలకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. గతంలో పాడి పశువులు అనారోగ్యానికి గురైతే రైతులు వ్యయప్రయాసాలకోర్చి కిలోమీటర్ల దూరం జీవాలను తీసుకెళ్లి వైద్యం అందించాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రభుత్వం సంచార వాహనాలను అందుబాటులోకి తీసుకురావడం వల్ల రైతులకు కష్టాలు తప్పాయి. 1962 నంబర్‌కు ఫోన్ చేస్తే చాలు పశువైద్య సిబ్బంది అంబులెన్సుతో సహా ఇంటి వద్దకే వచ్చి వ్యాధి నిర్ధారణ చేసి చికిత్స అందిస్తున్నారు. మెరుగైన వైద్యం అవసరమైతే తక్షణమే అదే వాహనంలో హైడ్రాలిక్ లిఫ్ట్ ద్వారా జీవాలను ఎక్కించి పశువైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స చేస్తున్నారు. ఫలితంగా పశుపోషకుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంచార వాహనంలో పశువైద్యునితోపాటు ల్యాబ్ టెక్నీషియన్, కాంపౌండర్, డ్రైవర్ అందుబాటులో ఉంటున్నారు. మాచర్ల నియోజకవర్గానికి ప్రస్తుతం రెండు సంచార వాహనాలను కేటాయించారు. వీటిల్లో ఒకటి మాచర్ల, వెల్దుర్తి, రెంటచింతల మండలాల్లో, మరొకటి దుర్గి, కారంపూడి మండలాల్లో వైద్యసేవలందిస్తున్నాయి.



మాచర్ల మండలంలో ఆవుకు వైద్యం అందిస్తున్న డాక్టర్ కుమారి, సిబ్బంది

1962కు ఫోన్ చేయండి చాలు



వెనుకబడిన పల్నాటి ప్రాంతంలోని మారుమూల ప్రాంతాలకూ పశువైద్యసేవలు అందుతున్నాయి. సంచార వాహనంపై గ్రామాలకు వెళ్లి మెరుగైన చికిత్స అందిస్తున్నాం. పశుపోషకులకు నిరంతరం అందుబాటులో ఉంటున్నాం. 1962కు ఫోన్ చేస్తే చాలు వెంటనే వెళ్లి జీవాలకు చికిత్స అందిస్తున్నాం. ఇప్పటివరకు నా పరిధిలోని మాచర్ల, వెల్దుర్తి రెంటచింతల మండలాల్లో సుమారు 2వేల పశువులకు వైద్యం అందించాం.

– డాక్టర్ ఎస్.కుమారి, పశువైద్యశాఖాధికారి

పశువైద్య సేవలు భేష్



మాకు పాడిపశువులే ప్రధాన ఆదాయ వనరు. గతంలో వాటికి జబ్బు చేస్తే చాలా ఇబ్బందులు పడేవారం. ఇప్పుడు సంచార పశు వైద్య వాహనం సేవలు చాలా బాగున్నాయి. 1962కు ఫోన్ చేయగానే సిబ్బంది వస్తున్నారు. చికిత్స చేస్తున్నారు. అవసరమైతే వాళ్లే పశువైద్యశాలకు వాహనంలో తీసుకెళ్తున్నారు. చాలా ఆనందంగా ఉంది.

– చామకూర ప్రభాకర్‌రెడ్డి, పాడి రైతు, రాయవరం గ్రామం

రసాయన పరిశ్రమలకు అనుమతులివ్వొద్దు

దాచేపల్లి నగర పంచాయతీ ఏకగ్రీవ తీర్మానం

దాచేపల్లి : ప్రజల ప్రాణాలకు హాని కలిగించే రసాయన పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దంటూ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ ఆధ్వర్యంలో అజెండాలో చేర్చిన అంశాన్ని రద్దు చేస్తూ తీర్మానం చేశారు. దీనికి టీడీపీ, జనసేన, స్వతంత్ర కౌన్సిలర్లూ మద్దతు పలికారు. మెజార్టీ కౌన్సిలర్ల అభిప్రాయం మేరకు చైర్‌పర్సన్ సుబ్బమ్మ రసాయన పరిశ్రమల ఏర్పాటుతోపాటుగా ప్రస్తుతం ఉన్న కర్మాగారాల్లో కొత్త ప్రాజెక్ట్‌లు నిర్మించకుండా తీర్మానం చేశారు. దాచేపల్లి-1 వార్డు సచివాలయంలో శుక్రవారం కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ సుబ్బమ్మ అధ్యక్షతన జరిగింది. నడికుడి పారిశ్రామికవాడలోని మెస్సర్స్‌షియోగ హెల్త్‌కేర్ ఫ్యాక్టరీలోని భూగర్భంలో పెట్రోలియం క్లాస్ ఏ ప్రొడక్ట్‌కు సంబంధించిన మెథానల్, యాక్టోన్ ట్యాంకులు, క్లాస్‌బీ ప్రొడక్ట్‌కు సంబంధించి టాల్కన్ ఇసోప్రసి ఆల్కహాల్ డ్రమ్ముల స్టోరేజి షెడ్లు, మెస్సర్స్ శ్రీహిత్ లాబ్స్‌లోని భూగర్భంలో పెట్రోలియం క్లాస్ ఏ ప్రొడక్ట్‌కు సంబంధించి ఎస్ టోన్ మెథానల్, హెస్టెన్ ట్యాంకుల ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం కోరుతూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తులు అందాయి. కలెక్టరేట్ నుంచి వచ్చిన సమాచారం మేరకు కౌన్సిల్ అజెండాలో పెట్టిన అంశంపై సభ్యులకు అధికారులు వివరిస్తుండగా కౌన్సిలర్లు అడ్డుతగిలారు. ఈ అంశాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆ తరువాత వైఎస్సార్ సీపీ సభ్యులకు టీడీపీ, జనసేన, స్వతంత్ర సభ్యులు కూడా మద్దతు తెలపగా చైర్‌పర్సన్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.



రసాయన పరిశ్రమలకు అనుమతులు ఇవ్వవద్దంటున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

రసాయన పరిశ్రమలతో ప్రమాదమే

నడికుడి పారిశ్రామికవాడలో ప్రస్తుతం ఉన్న రసాయన పరిశ్రమల వల్ల నడికుడి, ఇరికేపల్లి, నారాయణపురం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆ పరిశ్రమలను పూర్తిగా మూసివేయాలని స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని కూడా తాము కోరామని కౌన్సిల్ సభ్యులు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వద్దని కోరారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, అధికారుల సహకారంతో రసాయన పరిశ్రమలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ సుబ్బమ్మ చెప్పారు. వేసవిలో నగర పంచాయతీ పరిధిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని చైర్‌పర్సన్ చేసిన తీర్మానాన్ని సభ్యులు ఆమోదించారు. పలు అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. నగర పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఎమ్మెల్యే కాసు సహకారంతో నగర పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చైర్‌పర్సన్ తెలిపారు. సమావేశంలో కమిషనర్ అనిసెట్టి శ్రీవిద్య, వైస్ చైర్మన్లు కొమెర బత్తిన అన్నపూర్ణ, షేక్ మస్తాన్‌బీ, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమం కోసం కృషి

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర గోకుల్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమం, లేగదూడల ప్రదర్శనను శుక్రవారం దుర్గి పశు వైద్యశాలలో నిర్వహించారు. కార్యక్రమాన్ని జెడ్పీటీసీ శెట్టిపల్లి యల్లమంద, మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తోందని చెప్పారు. పశువులకు సంచార వైద్య సేవలను అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. పల్నాడు జిల్లా పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ పాడి రైతులు పశువైద్యాధికారుల సూచనలు పాటించాలని చెప్పారు. అనంతరం జరిగిన లేగదూడల అందాల పోటీల్లో 80 దూడలు పాల్గొన్నాయి. తర్వాత పశుపోషకులకు బహుమతులు అందించారు. లేగదూడల సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి.దిలీప్, సహాయ సంచాలకులు బి.జగదీష్ బాబు, డాక్టర్ ధనుంజయరెడ్డి, సర్పంచ్ చాట్ల శాంత రమేష్, ఎంపీటీసీ కటకం గోపాల్, యూత్ కన్వీనర్ యకటీల బుచ్చిబాబు, వీఎల్‌ఓ ఎ.ఆర్.శ్రీనివాసరావు, ఆర్.శ్రీధర్‌బాబు, రామకృష్ణ నాయక్, నాగశేషు, పి.మరియబాబు, పాడి రైతులు పాల్గొన్నారు.



పాడి మహిళా రైతుకు బహుమతి అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, వైద్యులు

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

గురజాల : గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు ఎంపీడీవో ఫణికుమార్ నాయక్ చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామోదయం కార్యక్రమంలో భాగంగా గంగవరం గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టిసారించినట్లు వివరించారు. అనంతరం ఆయన అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించారు. గురజాల నగర పంచాయతీ పరిధిలోని బేడ బుడ్గ జంగం కాలనీలో నగర పంచాయతీ కమిషనర్ అన్నదాత మోహన్ శ్రీనివాస్ పర్యటించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యురాలు పద్మావతి, సూపర్‌వైజర్ రమాదేవి, సెక్రటరీ నాయక్, కో- ఆప్షన్ సభ్యుడు షేక్ పీర్ అహ్మద్; ఎంపీటీసీ ఓబయ్య, అమర్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

వెల్దుర్తి: స్థానిక శ్రీశైలం రోడ్డులోని కోదండ రామాలయంలో శుక్రవారం శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభించినట్లు అఖిల భారత వాసవి సత్ర సముదాయాల సలహా మండలి సభ్యులు చిల్లంచర్ల సత్యం చెప్పారు. ఏటా కోదండ రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. రోజూ ప్రత్యేక పూజలు చేస్తున్నట్టు వెల్లడించారు.

స్టీలు గ్లాసులు పంపిణీ



విద్యార్థులకు స్టీలు గ్లాసులు అందిస్తున్న సర్పంచ్ అల్లాభక్షు తదితరులు

మాచవరం: విద్యార్థుల ఆరోగ్యంపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందని సర్పంచుల సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తురకపాలెం గ్రామ సర్పంచ్ షేక్ అల్లాభక్షు అన్నారు. మండలంలోని తురకపాలెం గ్రామంలో జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న రాగి జావ తాగేందుకు విద్యార్థుల కోసం సుమారుగా 300 స్టీలు గ్లాసులను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మేరీ గ్రేస్, ఉపాధ్యాయులు రాజేశ్వరావు, కోటేశ్వరావు, శ్యాంబాబు, నాగులమీరా పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో కోటేశ్వరావు

విజయపురిసౌత్: మాచర్ల మండలం నాగులవరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం ద్వారా విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీడీవో కోటేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెడుతున్నారా అని ఆరా తీశారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ప్రశాంతి, ఏఎస్‌ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వేమవరంలో గ్రామోదయం

మాచవరం: వేమవరం గ్రామంలో గ్రామోదయం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అధికారులు అంగన్‌వాడీ కేంద్రాలు, సంపద కేంద్రాలను పరిశీలించారు. ఎస్సీ కాలనీతోపాటు గ్రామంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డి.కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ జె.శివాయాదవ్, ఎంపీటీసీ ఎస్.లక్ష్మీనరసమ్మ, శ్రీనివాసరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లచ్చిరెడ్డి, ఎంపీడీఓ వై.రాజగోపాల్, ఈఓఆర్డీ వెంగళరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ జల దినోత్సవం

ఈపూరు: మండలంలోని కొచ్చర్ల గ్రామ సచివాలయంలో ఎఫర్ట్ సహకారంతో ప్రపంచ జల దినోత్సవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసర్పంచ్ కోపెల దేవరాజ్ మాట్లాడుతూ జలాల ప్రాముఖ్యతను వివరించారు. నీటిని ఎలా పొదుపు చేసుకోవాలి, భూగర్భజలాలు ఎలా పెంపొందించుకోవాలి అనే అంశాలను తెలియజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ నాగేంద్రబాబు, వీఆర్వో శ్యామేల్, ఎఫర్ట్ సంస్థ కమ్యూనిటీ మొబలైజర్ ఎఫ్రాయిమ్, ఏపీఎం, సీసీలు, ఏఎస్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది ఎఫర్ట్ సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా ఉపకార వేతనానికి ముగ్గురు విద్యార్థినుల ఎంపిక

మాచవరం: మాచవరం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులు జాతీయ ప్రతిభా ఉపకార వేతన పరీక్ష(ఎన్‌ఎంఎంఎస్)లో అర్హత సాధించినట్టు హెచ్‌ఎం తాతిరెడ్డి తెలిపారు. పాఠశాలకు చెందిన షేక్ సాజియా, బోరుపోగు బ్లెస్సీ, బద్దిశెట్టి గంగాహర్షితలు ఎంపికైనట్లు వివరించారు. వీరికి కేంద్ర ప్రభుత్వం ద్వారా ఏటా రూ.12 వేలు ఐదేళ్లపాటు అందుతాయని పేర్కొన్నారు.



ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయ బృందం

250 మందికి కళ్లజోళ్లు పంపిణీ

నాదెండ్ల: విద్య, వైద్య రంగాల్లో ప్రజలకు విశిష్ట సేవలందిస్తున్న జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్ సైదా అభినందనీయులని మున్సిపల్ మాజీ ప్రతిపక్ష నాయకుడు నాయుడు వాసు చెప్పారు. సంకురాత్రిపాడు గ్రామంలో శుక్రవారం 250 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ నెల 12న మ్యాక్సీ విజన్, శ్రీఐకేర్ సౌజన్యంతో జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు కంటి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. అవసరమైన వారికి శుక్రవారం కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ జాన్‌సైదా మాట్లాడుతూ చిలకలూరిపేట నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్లు చేయించి మందులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు గొంటు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్‌సైదా, నాయకులు

టీబీపై అవగాహన అవసరం



బ్రాహ్మణపల్లిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కరాలపాడు వైద్య బృందం, టీబీ నిర్మూలన కమిటీ సభ్యులు

పిడుగురాళ్లరూరల్: బ్రాహ్మణపల్లి గ్రామంలో టీబీపై అవగాహన సదస్సు, ర్యాలీ మంగళవారం నిర్వహించారు. వైద్యులు సుచరిత మాట్లాడుతూ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో రోగులకు టీబీ వ్యాధి లక్షణాలు, వ్యాధి ఎలా వస్తుంది, నిర్ధారణకు చేసే పరీక్షల గురించి వివరించారు. వ్యాధి బాధితులకు ఉచితంగా మందులు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కరాలపాడు వైద్యులు ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా ఉంటాం

దాచేపల్లి: విద్యార్థులకు అండగా ఉంటామని వినాయక ఇండస్ట్రీస్ అధినేత, మాజీ సర్పంచ్ బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుకుంటున్న 212 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, జామెంటరీ బాక్స్‌లను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలను రూ.వేల కోట్లు ఖర్చు చేసి అందంగా తీర్చిదిద్దుతోందని చెప్పారు. వినాయక ఇండ్రస్ట్రీస్ ఆధ్వర్యంలో కొన్నేళ్ల నుంచి పదో తరగతి విద్యార్థులకు సహకారం అందిస్తున్నామని, మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు తమవంతు సాయం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ షేక్ జాకీర్‌హుస్సేన్, ప్రధానోపాధ్యాయురాలు పి.శైలజ, స్థానికులు బలుగూరి నరసింహారావు, మందపాటి వెంకటరెడ్డి, గొట్టం అంజిరెడ్డి, కొప్పుల గురవారెడ్డి, కొత్త మధు, రామారావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, జామెంటరీ బాక్స్‌లు అందజేస్తున్న దృశ్యం

ఇఫ్తార్ విందు

కారెంపూడి: రంజాన్ మాసం ప్రారంభ శుభ దినాన కారెంపూడిలో ముస్లింలకు సర్పంచ్ రమావత్ తేజానాయక్ శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వెంకటరామిరెడ్డి ముస్లింలకు స్వయంగా భోజనాన్ని వడ్డించారు. అంతకుముందు ప్రత్యేక ప్రార్థనలలో వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. పల్నాడు జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అక్బర్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్ ఆరిఫ్, జెడ్పీటీసీ షేక్ షఫీ, ముస్లిం పెద్దలు మౌలానా, అమీర్‌సాబ్, యాసిన్, షేక్ మీరా, ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు కొంగర సుబ్రమణ్యం, బొమ్మిన అల్లయ్య, చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, పాతూరి రామిరెడ్డి, కొమ్ము చంద్రశేఖర్, చెన్నకేశవస్వామి ట్రస్టు బోర్డ్ చైర్మన్ చల్లా ప్రసాద్, కొమెర పిచ్చెయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో భోజనం వడ్డిస్తున్న పిన్నెల్లి వెంకటరామిరెడ్డి